# బిఆర్ఎస్ హామీలన్నీ మోసపూరితం

- కేసిఆర్ జిమ్మిక్కులు ప్రజలు నమ్మరు-
- టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం




కరీంనగర్, అక్టోబర్ 19, (మనంన్యూస్): బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ మోసపూరితమని రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వాటిని మెనిఫెస్టోలో ఇచ్చారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెడతారని అన్నారు. 2014 సం నుండి నేటి వరకు అధికారంలో ఉండి చేయలేని పనులన్నీ మళ్లీ అధికారం ఇస్తే చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు వారిని ఎలా నమ్ముతారు అని ప్రశ్నించారు. దళితులకు మూడు ఎకరాల భూమి పతకం అటకెక్కిందని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం అయిందన్నారు. దళిత బంధు బిఆర్ఎస్ కార్యకర్తల బంధు అయిందని ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల దారి మళ్లింపు,ముస్లింలకు పన్నెండు శాతం రిజర్వేషన్లను, నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు సాగునీరు ఎక్కడ ఇచ్చారో వెల్లడించాలని అన్నారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు పావలా వడ్డీ రుణాలు హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చేసే జిమ్మిక్కులు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది అన్నారు. మానకొండూరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా పోటీకి సిద్ధం-దామెర సత్యంతెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మానకొండూరు(ఎస్సీ) నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం తెలిపారు. పార్టీ అధిష్టానం తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని ఆయన కోరారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ మాదిరాజ్ నేతృత్వంలో ప్రజలు టిడిపిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుల నారా చంద్రబాబు నాయుడు పైన సైకో జగన్ రెడ్డి అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం తీవ్రంగా ఖండిస్తున్నామనీ, పసలేని అక్రమ కేసులు ఎన్ని పెట్టిన బాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాణపు ఆగయ్య, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ అవునూరి దయాకర్ రావు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పర్లపెల్లి రవీందర్, పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బోలుమల్ల సదానందంలు పాల్గొన్నారు.

## ఘనంగా సాయి సేవా సమితి వార్షికోత్సవం



జ్యోతినగర్, అక్టోబర్ 19, (మనం న్యూస్) : ఎన్టిపిసి మేడిపల్లి చౌరస్తాలోని సాయిసేవా సమితి 24 వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సాయి సేవా సమితి చేపడుతున్న పలు స్వచ్ఛంద కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన బృంద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా సమితి అధ్యక్షులు విశ్వనాథ్, ప్రతినిధులు రాందాస్, వేణుగోపాల్, నరేందర్, అశోక్ రెడ్డి కేఎస్ఎన్. రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న పెద్దపల్లి విద్యాధికారిణి మాధవి



వేములవాడ, అక్టోబర్ 19, (మనం న్యూస్) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని గురువారం పెద్దపెల్లి జిల్లా విద్యాధికారిణి దేశపతి మాధవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలో కొలువుదీరిన స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ మహా మండపంలో అర్చకులు వారిని ఆశీర్వాదించగా అధికారులు రాజన్న చిత్ర పటం, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. వారి వెంట మైవేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, రాజన్న ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ తదితరులు ఉన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



మెట్ పల్లి, అక్టోబర్ 19, (మనం న్యూస్): పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ అధ్యక్షులు దొంతుల ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణంలోని ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేశ్వర్లు ఉమాదేవి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి ముత్యాల ఆనంద్ రెడ్డి, క్యాషియర్ ఇల్లెందుల శ్రీధర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, రాజేందర్, ఆల్ రౌండర్ గంగాధర్ తదితరులున్నారు,

## బిజెపి నాయకులను పరామర్శించిన గడ్డం నాగరాజు



శంకరపట్నం, అక్టోబర్ 19, (మనం న్యూస్): శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో బిజెపి సీనియర్ నాయకుడు చల్ల ఐలయ్యకు గుండె ఆపరేషన్ కాగా, చల్ల ఐలయ్య కుటుంబాన్ని బిజెపి మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి గడ్డం నాగరాజు పరామర్శించి బిజిలి సారయ్య యాక్సిడెంట్ గాయపడగా గురువారం ఇంటి వద్ద గడ్డం నాగరాజు పరామర్శించారు.ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య, దొంగల రాములు, మండల ప్రధాన కార్యదర్శి దాసరపు నరేందర్, మండల ఉపాధ్యక్షులు కాంతాళ రాజిరెడ్డి, పెసర అర్జున్, మహేందర్ రెడ్డి దాసరి సంపత్ పాల్గొన్నారు.

## సొంత డబ్బులతో దోమల మందు పిచికారి



మెట్పల్లి రూరల్, అక్టోబర్ 19, (మనం న్యూస్) మండలంలోని వేంపేట గ్రామంలో గురువారం సొంత రూపాయలతో కొనుగోలు చేసిన దోమల మందును గ్రామంలోని డ్రైనేజీలలో పిచికారి చేయించారు ఈ సందర్భంగా గ్రామ ఉప సర్పంచ్ గోరు మంతుల ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామంలో దోమల వల్ల విష జ్వరాలు వ్యాపిస్తున్నాయా న్నారు దీంతో గ్రామ 9వ వార్డు మెంబర్ ఏలేటి పద్మ చంద్రశేఖర్ రెడ్డి తమ సొంత రూపాయలతో దోమల మందును కొని వార్డులో గల డ్రైనేజీలలో పిచికారి చేయించారన్నారు కాగా గ్రామ ప్రజలందరూ వారిని అభినందించారని తెలిపారు.

## పాతపెల్లి ఎల్లయ్యపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నాం

- కాంగ్రెస్ నాయకులు చుక్కల శ్రీనివాస్



గోదావరిఖని, అక్టోబర్ 19, (మనం న్యూస్): పాతపెల్లి ఎల్లయ్య పై బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ నారాయణదాసు మారుతి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ నాయకులు చుక్కల శ్రీనివాస్,తిప్పారం శ్రీనివాస్ ఖండించారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూఎల్లయ్య అక్రమ సంపాదన గురించి మాట్లాడిన అతను గతంలో ఒక కాంట్రాక్టర్ అని తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. గత ఎన్నికల్లో కోరుకంటి చందర్ మాజీ కార్పొరేటర్ల కాళ్ళు మొక్కి తమను గెలిపించాలని అభ్యర్థించారని అన్నారు.తమ నాయకుడు కోరుకంటి చందర్ ఆర్ఎఫ్సిఎల్ లో ఉద్యోగాల పేరు మీద అమాయక ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేయలేదా, కాంట్రాక్ట్ కార్మికుల చావుకు కారణం ఎమ్మెల్యే చందర్ కాదా అని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు అప్పుల్లో ఉన్న కోరు కంటి చందర్ ఎమ్మెల్యే అయ్యాక ఇసుక దందా, బూడిదందా, ఉద్యోగాల పేరుతో అక్రమ వసూళ్లు చేసి వందల ఎకరాల భూములు,వందల కోట్ల రూపాయలు, కోట్లులు విలువ చేసే ఇల్లు కూడబెట్టాడని ఆరోపించారు. పాతిపెల్లి ఎల్లయ్యపై అవినీతి ఆరోపణలు చేస్తున్న మీరు నిరూపించే దమ్ముందా అని ఛాలెంజ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మక రాజేష్, కందుల సతీష్, దాసరి సాంబమూర్తి, రమేష్, కుడిదల శివ, ఎండి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ రోడ్ షోను విజయవంతం చేయాలి

- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్



వేములవాడ, అక్టోబర్, 19, (మనం న్యూస్): వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి మండలంలో శుక్రవారం నిర్వహించే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ రోడ్ షో ను విజయవంతం చేయాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల జరుతున్న వేళ నియోజకవర్గంలోని మేడిపల్లి మండలంలో మధ్యాహ్నం 12 గంటలకు రాహుల్ గాంధీ రోడ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దేశానికి కాబోయే భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రలో అందరి సమస్యలు విని రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు.రోడ్ షోకు ప్రతి ఒక్కరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్, నాయకులు కనికరపు రాకేష్, నాగుల రాము గౌడ్, కూరా దేవయ్య, మూల కిషోర్, గుర్రం తిరుపతి, సుగూరి సుధాకర్, కోలాకారి రాజు వస్తాది కృష్ణ గౌడ్, దూలం భూమేష్, నీలం గురవయ్య చిలువేరి శ్రీనివాస్, పల్లపు రాజేందర్, ఎర్ర శ్రావణ్, నాగుల మహేష్, బాలు, అక్కనపల్లి నరేష్, మండే రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పాలకుల ఉనికిని కాపాడుకునేందుకే మీడియాను అణగదొక్కుతున్నారు

- పతనం ప్రారంభమై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు
- వారం వ్యవధిలో ముగ్గురు జర్నలిస్టులపై కేసులు ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదం
- కేసులపై పునరాలోచించకపోతే ఆందోళన తప్పదు
- తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్




కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 19, (మనం న్యూస్): మీడియాను అణగదొక్కకపోతే, తమ ఉనికికే ప్రమాదమనే భావనలో పాలకులు ఉన్నారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్ అన్నారు. తమ పతనం ప్రారంభమై బలహీనులుగా మారుతోన్న సమయంలో బుల్డోజర్ సంస్కృతి అమలు చేసేందుకు ముందుకు వస్తున్నారని వ్యాఖ్యానించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వారం రోజుల వ్యవధితో ముగ్గురు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ గురువారం కరీంనగర్ ప్రెస్ భవన్లో టియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ పాలకులు, అధికారులు అనుసరిస్తోన్న వైఖరి కారణంగానే రాజ్యాంగం ప్రజలకు కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ, దానితో ముడిపడి ఉన్న పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగే రోజులు వచ్చాయన్నారు. మీడియాను అణచివేసే విధానాలు ప్రస్తుతం బుల్డోజర్ స్థాయికి పెరిగిపోయాయన్నారు. ప్రస్తుత ఎన్నికల సమయంలో కరీంనగర్ జర్నలిస్టులు గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, ఎవరిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారో తెలియని దుస్థితి దాపురించిందన్నారు. అయితే వాటన్నింటినీ ఎదుర్కొనేందుకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. పోరాటాలే ఊపిరిగా ఆరు దశాబ్దాల కాలం ఈ సంఘం ముందుకు సాగుతున్న విషయాన్ని జర్నలిస్టులపై కేసులు నమోదు చేసేవారు, చేయించేవారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ఉన్న గౌరవం, నమ్మకంతోనే ఎన్నికల నిబంధనావళికి లోబడి గురువారం తాము చేపట్టిన ఆందోళనను సభ్యుల వరకే పరిమితం చేశామని శేఖర్ స్పష్టం చేశారు. అంతమాత్రాన వెనకడుగు వేసేది లేదని, ఒక అడుగు వెనక్కి వేస్తే, నాలుగు అడుగులు ముందుకు పడినట్టేనన్నారు. వారం రోజుల వ్యవధిలో కరీంనగర్ పట్టణంలో ముగ్గురు జర్నలిస్టులపై పెట్టిన కేసుల పట్ల ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ కేసుల విషయంలో పోలీసు యంత్రాంగం పునరాలోచించాలని, పునః సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు తాడూరు కరుణాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎలగందుల రవీందర్, జానంపేట మారుతి స్వామి, ఉపాధ్యక్షులు ఒంటెల కృష్ణ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కొమ్మెర తిరుపతిరెడ్డి, టియుడబ్ల్యుజె నాయకులు ఎంఏ. అసద్, రమేష్, కొండల్ రెడ్డి, సందీప్ కుమార్, 18 మండలాలకు చెందిన వంద మంది సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ యోగాలో రాష్ట్ర క్రీడాకారులు పతకాల పంట పండించాలి

- రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్
- ముగిసిన రాష్ట్రస్థాయి యోగ చాంపియన్ షిప్ పోటీలు
- ఓవరాల్ చాంపియన్ షిప్ కరీంనగర్ కైవసం
- ద్వితీయ, తృతీయ స్థానాల్లో రంగారెడ్డి, మహబూబ్నగర్

కరీంనగర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న యోగా క్రీడాకారులు అస్సాం రాష్ట్రంలోని గౌహతి లో జరుగనున్న జాతీయస్థాయి యోగా చాంపియన్షిప్ పోటిల్లో పతకాల పంట పండించి తెలంగాణ రాష్ట్ర కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. కరీంనగర్ జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థలు, రైస్ మిల్లర్స్ సంఘం సౌజన్యంతో గత రెండు రోజుల పాటు కరీంనగర్ పద్మనగర్లోని మానేర్ సెంట్రల్ స్కూల్ ఆవరణలో జరుగుతున్న పదవ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీలు గురువారంతో ముగిసాయి. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో జాతీయస్థాయి యోగా పోటీలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని, జాతీయ పోటీల నిర్వహణ భాద్యతలను కరీంనగర్కు వచ్చే విధంగా చూడాలని రాష్ట్ర సంఘాన్ని కోరారు. ప్రస్తత కాలంలో యోగను ప్రతి ఒక్కరు చేయాలన్నారు. నేడు యోగా ను భారత ప్రభుత్వం ఒక క్రీడగా గుర్తించిందన్నారు. ఎందరో యోగా క్రీడాకారులు స్పోర్ట్స్ సర్టిఫికేట్లతో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. కరీంనగర్ జిల్లా వరుసగా చాంపియన్ షిప్లను కైవసం చేసుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం ప్యాట్రన్, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర యోగా పోటీలు ప్రశాంతమైన వాతావరణంలో దిగ్విజయంగా జరిగాయన్నారు. యోగా సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు జె మనోహర్ కుమార్, నాగిరెడ్డి సిద్దారెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పో టిల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన క్రీడాకారులను నవంబర్ 23 నుంచి 26 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరుగనున్న జాతీయస్థాయి యోగా పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో జాతీయ, అంతర్జాతీయస్థాయి యోగా క్రీడాకారులకు కొదువలేదన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను, పతకాలను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, కన్న కృష్ణ, రాష్ట్ర యోగ సంఘం బాధ్యులు కమలాకర్, బాలరాజుతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు,కోచ్లు,మేనేజర్లు,క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఓవరాల్ చాంపియన్ కరీంనగర్..

10వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ ను కరీంనగర్ జిల్లా జట్టు కైవసం చేసుకొంది. 8 సంవత్సరాల వయస్సు విభాగం నుంచి 45 సంవత్సరాల వయస్సు విభాగాల్లో బాలబాలికలకు, పురుషులకు, మహిళలకు వేరు వేరుగా పోటీలను నిర్వహించగా అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి చాంపియన్ గా నిలిచింది. మొత్తం 34 పాయింట్లు సాధించి 12వ సారి చాంపియన్ షిప్ ను కైవసం చేసుకొని రికార్డ్ సృష్టించింది. రంగారెడ్డి జిల్లా జట్టు క్రీడాకారులు 22 పాయింట్లు సాధించి ద్వితీయ చాంపియన్ షిప్పు, మహబూబ్నగర్ జిల్లా జట్టు క్రీడాకారులు 16 పాయింట్లు సాధించి తృతీయ చాంపియన్ షిప్ కైవసం చేసుకొన్నాయి.

## ఘనంగా దుర్గా భవానీ నవరాత్రోత్సవాలు

- లలిత త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు



కరీంనగర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): కరీంనగర్రూరల్ మండలం నగునూర్లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో దుర్గా మాత నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగవరో జైనా గురువారం దుర్గాభవానీ అమ్మవారు లలిత త్రిపుర సుం దరి అలంకరణలో కామేశ్వరుడి వాహనంపై భక్తులకు దర్శనమి చ్చారు, ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వ ర్యంలో ఆలయ ప్రధానార్చకులు పవన కృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు. చతుషష్ట్యుపచార పూజ, చండీహోమం, కుంకుమ పూజలు, కన్యాసువాసినీ పూజలు జరిగాయి, భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీరేసారే పెట్టి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి బాధ్యులు, భక్తులు పాల్గోన్నారు.


## దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.5 వేలు విరాళం



జమ్మికుంటరూరల్, అక్టోబర్ 19, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మడిపల్లి గ్రామంలో గురువారం దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కాంగ్రెస్ నాయకులు రూ 5వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాదేవి అమ్మవారికి కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు అమ్మవారి కరుణాకటాక్షాలతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సుంకరి రమేష్, ఎగ్గెటి శంకర్, మహిపాల్ రెడ్డి, ఎగ్గెటి సదానందం రమేష్ యాదవ్, అశోక్ ఉప్పుల సాంబ శివరెడ్డి, ఎండి ఫయాజ్, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి నిబంధనలను పాటించాలి


- తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి



తిమ్మాపూర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మా పూర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం మానకొండూరు నియోజకవ ర్గం పరిధిలోని తిమ్మాపూర్, చిగురుమామిడి, గన్నేరువరం మండలాల కు సంబందించిన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులతో తిమ్మా పూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ఐలతో కలిసి రాను న్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచారం,, ఇతర ఎన్ని కల సంబంధిత అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా తగు సూచనలు చేస్తూ ఎన్నికల ప్రచారం, ర్యాలీలు తదితర కార్యక్ర మాల కోసం సంబంధిత అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలని ఇతర పార్టీల వారిని కించపరిచే విధంగా మనోభా వాలను దెబ్బతీసేలా నేరుగానైన లేదా వివిధ ప్రసార మాధ్య మాలు లే దా సామాజిక మాధ్యమాల్లో వ్యవహరించ కూడదని ఎవరైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘ నలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో తిమ్మాపూర్ సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎల్ఎండిఎస్ఐ ప్రమోద్ రెడ్డి, చిగురు మామిడి ఎస్ఐ రాజేష్, గన్నేరువరం ఎస్ఐ నర్సింగ రావు లతో పాటు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అడ్వాన్స్, లాభాల వాటా చెల్లింపునకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్?

- 21న చెల్లించడానికి సింగరేణి యాజమాన్యం అంగీకారం
- సర్క్యులర్ కోసం ఎదురుచూపులు




మంచిర్యాల, అక్టోబర్ 19, (మనం న్యూస్): ఎట్టకేలకు సింగరేణి కార్మికులకు 32 శాతం లాభాల వాటాతో పాటు దసరా అడ్వాన్సు ఈ నెల 21వ తేదీన చెల్లించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంలో ఎన్నికల సంఘం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో చెల్లింపులను సింగరేణి నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. దాంతో కార్మిక వర్గం గగ్గోలు పెట్టడంతో అన్ని సంఘాల్లో కదలిక వచ్చింది. ఎవరికివారు వివిధ రకాల ప్రయత్నాలు చేయడంతో సమస్యకు పరిష్కార మార్గం లభించినట్లైంది. ఈ సందర్భంగా ప్రస్తుత గుర్తింపు సంఘం టిబిజికెఎస్ యూనియన్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య చెప్పిన ప్రకారం , తాము తమ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత దృష్టి కి తీసుకెళ్లగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం, ఎన్నికల సంఘం తో మాట్లాడి ఒప్పించడం జరిగిందని ,పే షీట్ రెడి అయితే ఈ నెల 20న చెల్లించడానికి సింగరేణి యాజమాన్యం ఒప్పుకుందని తెలిపారు. ఆ రోజు సాధ్యం కాని పక్షంలో 21న చెల్లించడానికి సింగరేణి యాజమాన్యం ఒప్పుకున్నట్లు వివరించారు. తమ యూనియన్ , సింగరేణి కార్మికుల పోరాట ఫలితంగా, ఎన్నికల కోడ్ పేరుతో ఆపిన లాభాల వాటా, దసరా అడ్వాన్స్‌లను రెండు సింగరేణి యాజమాన్యం, రోజుల్లో చెల్లింపులకు రంగం సిద్ధం చేస్తున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. ఈ విషయమై అన్ని యూనియన్లతో కలిసి ఉమ్మడిగా యాజమాన్యంపై ఒత్తిడి తెద్దామని పిలుపునివ్వగా, కొన్ని కార్మిక సంఘాలు ఆసక్తి చూపలేదని ఆ తర్వాత యాజమాన్యంతో చర్చించగా చెల్లించడానికి అంగీకరించిందన్నారు. 20న అన్ని ఏరియాలకు ఆదేశాలు జారీ చేయాలని యాజమాన్యాన్ని కోరినట్లు, ఒకవేళ ఆరోజున ఖాతాల్లో డబ్బులు జమ కాకపోతే 21వ తేదీన అన్ని గనుల మీద టూల్ డౌన్ నిరసన తెలియజేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఐఎన్టీయుసి సెక్రటరీ జనరల్ .బి.జనక్ ప్రసాద్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజకుమార్, బిఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి మాధవ్ నాయక్. వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్‌లు కూడా 21న కార్మికులకు దసరా అడ్వాన్స్, లాభాల వాటా కార్మికులకు చెల్లిస్తారని తెలిపారు.

## ఐక్య వ్యాపార సంఘం భవన నిర్మాణానికి ముందుకు రావాలి

- సంఘం అధ్యక్షులు మైలారపు సుధాకర్



లక్షెట్టిపేట్, అక్టోబర్ 19, (మనం న్యూస్): పట్టణంలో నూతనంగా నిర్మించబోయే ఐక్య వ్యాపార సంఘం భవన నిర్మాణానికి వ్యాపారులందరూ ముందుకు రావాలని ఆ సంఘం అధ్యక్షులు మైలారపు సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం భవన్ నిర్మాణానికి కొత్త సతయ్య, రాజవ్వ కొమ్ముగూడెం వాస్తవ్యుల జ్ఞాపకార్థంగా వారి కుమారుడైన ఐక్య వ్యాపార సంఘం గౌరవ అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు రూ. 8లక్షల11వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మైలారపు సుధాకర్ మాట్లాడుతూ ఐక్య వ్యాపార సంఘం వ్యాపారస్తుల అందరి సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. సంఘం భవనం ఉండటం వలన వ్యాపారులకు ఏదైనా సమస్య తలెత్తితే పరిష్కారం కోసం సంఘాన్ని మరింతగా ఆశ్రయించే అవకాశాలు కలుగుతాయన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న మార్కెట్ ధోరణులను, నూతన విధానాలను వ్యాపారాలు చేసే వ్యక్తులు తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. అంతకుముందు సంఘం గౌరవ అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘం భవన్ నిర్మాణానికి నా వంతుగా ఆర్థిక సాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి వ్యాపారి భవన్ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, ఐక్య వ్యాపార సంఘం ప్రధాన కార్యదర్శి పల్లెర మహేందర్, తాటికొండ శ్రీనివాస్, సురేష్,హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం



తిమ్మాపూర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామ శాఖ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా అధ్యక్షులు నరహరి జగ్గారెడ్డి, మండల గౌరవ అధ్యక్షులు ఇనుకొండ జితేందర్ రెడ్డి అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా దేవసాని తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇనుకొండ నరసింహా రెడ్డి, చింతకుంట వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, ప్రచారకార్యదర్శి ఇనుకొండ మాధవ రెడ్డి, కోశాధికారి జనార్ధన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కొమ్మర శ్రీనివాస్ రెడ్డి, సోమిరెడ్డి మనోహర్ రెడ్డి తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రెడ్డి పాలక వర్గం సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కుల సంక్షేమానికి కృషి చేస్తానని, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తమ నియామకానికి కృషిచేసిన రెడ్డి సంఘ నాయకులకు, సంఘ సభ్యులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండ గోపాల్ రెడ్డి, తిమ్మాపూ ర్ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, రామకృష్ణ కాలనీ గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షులు దావు సంపత్ రెడ్డి, పెండ్యాల కేశవరెడ్డి, రాంరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఎన్నికల్లో బిజెపికి అవకాశమివ్వాలి

- ఉన్నత విద్యావంతుడు రఘునాథ్‌ను గెలిపించాలి
- మహారాష్ట్ర ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ రాంజీ



మంచిర్యాల, అక్టోబర్ 19, (మనం న్యూస్): రాబోయే ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గంలో బిజెపికి అవకాశమిచ్చి, ఉన్నత విద్యావంతుడు, ఉన్నత ఆలోచనలున్న వ్యక్తి వెరబెల్లి రఘునాథ్‌ను గెలిపించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల ఇంచార్జి, మహారాష్ట్ర రాలేగావ్ శాసనసభ్యులు డాక్టర్ అశోక్ రాంజీ ఉయికే ఓటర్లను కోరారు. గురువారం స్థానిక ఫ్లడ్ కాలనీ, సెవెనహిల్స్ కాలనీలో నిర్వహించిన గడప గడపకు బిజెపి ప్రచార కార్యక్రమంలో అయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చిట్ట చివరి వ్యక్తి వరకు చేరాలంటే రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తేనే అది సాధ్యమన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే అసమర్థత, చేతకాని తనం వల్ల నస్పూర్ మున్సిపాలిటీ అవినీతికి, కబ్జాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. బిజెపికి అవకాశం ఇస్తే నస్పూర్ మునిపాలిటీకి అన్ని మౌలిక వసతులతో కూడిన స్మార్ట్ సిటీ గా మారుస్తామన్నారు. బిజెపి ప్రచారం శక్తి కేంద్రం ఇంచార్జి మద్ది సుమన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ కన్వీనర్ సత్రం రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద కృష్ణ, పెదపెల్లి ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ పనుగంటి మధు, నస్పూర్ పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సాధనందం, బిజెవైఎం పట్టణ అధ్యక్షులు కొండ వెంకటేష్, బిజెవైయం జిల్లా కార్యదర్శి రనవేనా శ్రీను, మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాషా, బుసారపు తిరుపతి, సత్య నారాయణ, బిజెవైఎం నాయకులు అంబాలా సాగర్, తడూరి మహేష్, కొండ్రా రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# కవ్వంపల్లి, ఆరెపల్లిలే దళిత వ్యతిరేకులు

- రసమయిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు
- బిఆర్ఎస్ దళిత సంఘ నాయకులు



తిమ్మాపూర్, అక్టోబర్ 19, (మనం న్యూస్): డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ, బిజెపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌లే అసలైన దళిత వ్యతిరేకులని బిఆర్ ఎస్ దళిత సంఘ నాయకులు వ్యాఖ్యానించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమెల్యే రసమయి బాలకిషన్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో రసమయికి ప్రజల నుంచి వస్తోన్న ఆదరణను చూసి తట్టుకోలేక కవ్వంపల్లి, ఆరెపల్లిలు అబద్ధపు ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అడుగడుగునా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బోయిని కొమురయ్య, మేడి అంజయ్య, నేదునూరి శంకర్, మండల సీనియర్ నాయకులు వంతడుపుల సంపత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కోయడ మురళి నాయకులు పారునంది జలపతి, మాతంగి లక్ష్మణ్, సంగుపట్ల మల్లేశం, బొర్రా రవన్న, బోయిని తిరుపతి, నగునూరి వంశీ, ఖమ్మం కృష్ణ, దుర్గం అశోక్, దుర్గం శ్రీనివాస్, సముద్రాల మల్లేష్, రొడ్డ రమేష్, జెజెల వెంకటేశ్వర్లు, గోస్కి శ్రీనివాస్, ఎలకపల్లి లక్ష్మణ్, అసంపల్లి అశోక్, తాళ్లపల్లి నందకిషోర్, తూర్పాటి అజయ్, అల్వాల సంపత్, ఉప్పులేటి కుమార్, ఉప్పులేటి అంజి, కిన్నెర బాలస్వామి, గోస్కి శ్రీనివాస్, కండె కొండయ్య, తాటిపల్లి సంపత్, దప్పు తిరుపతి, గోదారి సంతోష్, మేకల సునీల్, ఆలువాల సాయి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు



మంథని, అక్టోబర్ 19, మనం న్యూస్ : మంథని నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి బిఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికల పర్వం కొనసాగుతుంది. మహాముత్తారం మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంథని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి,జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు, సీనియర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాల ప్రచారం



బోధన్, అక్టోబర్ 19, (మనం న్యూస్): బోధన్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని27వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ కారడ్స్ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన వర్గాలకు,ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చే విధంగా పథకాలు రూపొందించిందని, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు మహిళలకు మంచి పథకాలు మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందని వివరించారు.ఈసారి టిఆర్ఎస్ అభ్యర్థిని గురించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు సూచించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారి, యూత్ ప్రెసిడెంట్ తలారి నవీన్, దాము,బడు,ఎస్టి సెల్ ప్రెసిడెంట్ సాయి కృష్ణ, మైనార్టీ ప్రెసిడెంట్, కలీం, చిరంజీవి,ఆదినారాయణ,హర్షద్, గంగన్న, దీన్ దయాల్, జహీర్, ఇనాయత్, ఆమెన్, వాహద్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేపట్టాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 19, (మనం న్యూస్): శాసన సభ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో స్ట్రాంగ్ రూం లు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా గురువారం రోజున జగిత్యాల నియోజక వర్గము నకు సంబంధించిన వి.ఆర్.కే. కళాశాలలో ప్రతిపాదిత ఓట్ల లెక్కింపు కేంద్రం, మినీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ కేంద్రం, ధర్మపురి నియోజక వర్గము నకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఆయా స్ట్రాంగ్ రూంలలో అవసరమైన పనులు చేపట్టాలని, స్ట్రాంగ్ రూంల ముందు సిసి కెమెరాలు, విద్యుత్ లైట్స్, తదితర ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. మెటీరియల్ పంపిణీ లకు అవసరమైన బారికేడింగ్ చేయించాలని అన్నారు. స్ట్రాంగ్ రూంలకు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కోరుట్ల ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ కేంద్రం లలో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, దివాకర, ఆర్డీవోలు నరసింహ మూర్తి, రాజేశ్వర్, పోలీసు, రెవిన్యూ, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు, మునిసిపల్ కమిషనర్ లు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్, బిజెపిలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి

చొప్పదండి, అక్టోబర్ 19, (మనం న్యూస్): రాబోయే శాసన సభ ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ ఎస్ ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సిపిఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చొప్పదండి మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఒక్క డిఎస్సీ వేయకుండా గ్రూప్ వన్, గ్రూప్ టూ పరీక్షలు నిర్వహించకుండా కాలం వెళ్లదీసిన బిఆర్ఎస్ పార్టీకి యువత తమ ఓటు హక్కు ద్వారా బుద్ధి చెప్తారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించి సంవత్సరాలు గడిచాయని రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. ఇంటికో ఉద్యోగం, నియోజకవర్గానికి లక్ష ఎకరాల సాగునీరు, దళితులకు మూడెకరాల భూమి, అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, 57 సంవత్సరాలకే పెన్షన్, రైతులకు ఎరువులు, పురుగు మందులు ఉచితంగా పంపిణీ, 50 సంవత్సరాలకే నేత గీత వారికి పెన్షన్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజ్, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు తదితర హామీలు నేటికీ అమలు చేయని టిఆర్ఎస్ ప్రభుత్వానికి చమగీతం పాడాలని వాసుదేవ రెడ్డి అన్నారు. పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి టీఎస్పీఎస్సీని నిర్వీర్యం చేశారన్నారు. టీఎస్పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడానికి ఏం అడ్డంకులు వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో వైద్యం ఖరీదైందని సామాన్యుడు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేని దీనస్థితిలో ఉన్నారన్నారు. పది సంవత్సరాల కాలంలో గుర్తురాని మహిళలు మళ్లీ గెలిపిస్తే మూడు వేలు ఇస్తామని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు రాలేదు, నిధులు రాలేదు, నియామకాలు అసలే లేవని తెలంగాణకు ముందు తెలంగాణ వచ్చిన తర్వాత కూడా విద్యార్థుల ఆత్మహత్యలు జరగడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. నిరుద్యోగులంతా గ్రామాల బాట పట్టి ప్రజలను చైతన్యం చేయాలని, అవినీతిపరులను ప్రజా వ్యతిరేకులను ఓడించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ విధానాలను అనుసరిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని గాలి వదిలింది అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఆచరణలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతుకు రెట్టింపు ఆదాయం వచ్చేటట్లు చూస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకపోగా భూమి నుండి రైతును దూరం చేసే చట్టాలను తీసుకొస్తే రైతులు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడి విజయం సాధించారని గుర్తు చేశారు. కేవలం కులం మతం ఆధారంగా భావోద్రేకాలను రెచ్చగొడుతూ దేశ సంపదను పప్పు బెల్లాళ్ల అదానీ, అంబానీలకు తనాఖా పెడుతూ, అమ్ముతూ దేశాన్ని దివాలా తీయించారన్నారు. జన్ ధన్ ఖాతాల్లో డబ్బులు వేయకపోగా, స్విస్ బ్యాంకుల్లో దాచుకున్న డబ్బులు ఏమయ్యాయో కేంద్ర ప్రభుత్వమే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చొప్పదండి జోన్ కార్యదర్శి యు శ్రీనివాస్, నాయకులు గంగిపల్లి కుమార్, మారంపల్లి నాగభూషణం, మరిమట్ల రమేష్, ఉజ్జేటి శేఖర్, పొన్నాల సమ్మయ్య, కనకరాజు, భూమయ్య, కనుకయ్య, రమేష్, ఓదెలు, శ్రీనివాస్, సంతోష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన రావుల ప్రసాద్



మంచిర్యాల, అక్టోబర్ 19, (మనం న్యూస్): కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రావుల ప్రసాద్ గురువారం బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసంలో జరిగిన కార్యక్రమంలోబిఆర్ఎస్‌లో చేరగా, పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల కారణంగా బిఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.

## ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి బి.గోపి




కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 19, (మనం న్యూస్): అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకొని సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ బి. గోపి తెలిపారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్. అంబేడ్కర్ ప్రభుత్వ మోడల్ రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన మానకొండూర్ నియోజక వర్గ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను అదనపు కలెక్టర్‌తొ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లను పూర్తిచేసుకోవాలని సూచించారు. కళాశాల వద్ద వాహనాల పార్కింగ్ కొరకు స్థలాన్ని చదునుచేయాలన్నారు. అనంతరం మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సి విజిల్, సువిధ, కంట్రోల్ రూంలలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి వద్ద గల స్టాటిక్ సర్వే లైన్ చెక్ పోస్ట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, తహసీల్దార్ కనకయ్య, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మత్తడి పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆది శ్రీనివాస్



వేములవాడ, అక్టోబర్ 19, (మనం న్యూస్): దేవీ నవరాత్రులను పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని మత్తడి పోచమ్మ తల్లిని నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూలోక కళ్యాణం జరిగి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల జీవితాల్లో వెలుగులు నిండాలన్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు ఎల్లవేళలా ప్రజలందరి పైన ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షులు సాగారం వెంకటస్వామి, రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వకలాభరణం శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంఘ స్వామి యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షులు కూరగాయల కొమురయ్య, మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 30 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెట్ పల్లి టౌన్, అక్టోబర్ 19 (మనం న్యూస్): పట్టణంలోని డిడి నగర్‌లో బుధవారం 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పక్కా సమాచారం మేరకు డిడి నగర్‌లోని కొమ్ము గట్టయ్య ఇంటివద్ద సోదా చేయగా 30 లీటర్ల గుడుంబా దొరికినట్లు ఆయన తెలిపారు. గుడుంబాతో సహా నిందితున్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

